ఓ పక్కన ఊరి ప్రజల అప్యాయతని గురించి ప్రస్తావిస్తూ మరో ప్రక్కన గ్రామాల్లో పాతకాలపు వివాహేతర బంధాన్ని సున్నితంగా చెప్పిన ఓ ట్రాజడీ కథ.

## బుచ్చమ్మ కథ

ఎదురుమదురుగా ఉన్న తూర్పు కనుమల మధ్య లోయల్లోంచి వంకలు తిరుగుతూ, ఒయ్యారాలు పోయే నవజవ్వనిలా పారుతూంటుంది తాండవ నది. ఆ నదికి కొంచెం ఎగువగానూ, పెనుగొండకి దిగువగానూ ఉంది గునుపూడి. అదో చిన్న పల్లెటూరు. ఆ నదికి వంతెన లేకపోవడంవల్లనూ, ఆ ఎత్తైన కొండలు దాటలేకా, ఇటు తుని నుంచీ, అటు నర్సీపట్నం నుంచీ కూడా, ఇంకా నవనాగరికత ఆ ఊళ్ళో ప్రవేశించలేదు. పల్లెటూరి వాతావరణమూ, అక్కడి ప్రజల అమాయకతా, అల్ప సంతోషిత్వమూ చూస్తూంటే, అరవిచ్చి అందాల్ని వెదజల్లే ముద్దబంతి పువ్వు జ్ఞప్తికి వస్తుంది నాకు. అది మా ఊరు కావడం కూడా కొంత కారణం కావచ్చు.

నందూర్లో బస్సు దిగి, నడక సాగించిన నేను పై ఊహలు మనసులో మెదులు తూండగా ఆరు కిలోమీటర్ల దూరం ఆయాసం తెలియకుండా నడిచి గునుపూడి పొలిమేరల్లో అడుగు పెట్టాను. అల్లంత దూరంలో కనిపించే ఊరూ, పొలాల్లో మేసే అలమందలూ, వాటిని అదిలిస్తూ గోపాలకులు, ఆహ్లాదకరమైన సాయంసంధ్య. అక్కడికి రాగానే నాకు తప్పకుండా జ్ఞాపకం వచ్చే పద్యం 'అదుగో ద్వారక....'

"మావయ్యగోరూ! ఇదేనా రావటమండీ!"

ఆలోచనల్లోంచి తేరుకుని వెనక్కి చూశాను. నెత్తి మీద నిండుగా ఉన్న గడి బుట్ట. చేతిలో తవ్వగోల, ముఖం మీద చిరుదరహాసంతో ఓ పల్లె పడుచు పలకరింపు అది. నా వెనకే నడిచి వస్తూంది ఆమె.

"ఏం మనవడా ఇంత పొద్దు పోయొస్తున్నావు. పొద్దుటి బండికి రానేపోయావా?" బాణాకర్ర మెడమీద అడ్డుగా వేసుకుని, బలమైన రెండు చేతులూ, రెండు వైపులా వెనకనుంచి దానిపై వేసి నోట్లో కాల్చే పెద్ద చుట్టతో ఓ ముసలాయన ప్రశ్న.

"ఆ ఊరు నుంచే వస్తున్నారా బాబూ?" మరో పెద్దమనిషి పరామర్శ.

"అక్కడ వర్షాలెలా ఉన్నాయి తమ్ముడుగారూ?' మాకైతే వానలే పడలేదండి!" ఇంకో కర్షకుడు.

"బావగారు ఒక్కరే వస్తున్నారు. మా చెల్లెమ్మని తీసుకురాలేదు కాబోలు" - ఓ నవ యువకుడు.

అందరూ తలొక ప్రశ్న వేస్తుంటే ఉచిత రీతిని సమాధానాలు చెప్పుతూ నడుస్తున్నాను. నాతో మాట్లాడుతూ నా వెనకాలే వచ్చే వాళ్ళంతా పొలం పనులు చేసుకుని ఇళ్ళకి మళ్ళీ పోయే మా ఊరి మనుషులు. ఇలా వరసలు పెట్టి పిల్చుకోవటం అక్కడి మనుషులు అరమరికలు లేకుండా, ఒకరికొకరు ఆత్మీయులుగా మసులుకుంటారనడానికో ఉదాహరణ. దీనికి అగ్రజాతి వారనీ, అధమజాతి వారనీ భేదం లేదు. అంతా ఒకే కుటుంబంలా ఉంటారు. సర్వమానవ సౌభ్రాత్రం ఇక్కడుంది గానీ, కపట నాటకాలాడే కుహనా నాయకులు పట్నవాసాల్లో దంచే ఉపన్యాసాల్లో లేదనిపిస్తుంది నా కెప్పుడూ.

అలా అందరితో కబుర్లు చెబుతూ ఇంటి దాకా వచ్చేశాను.

"అదేం బాబూ! ఉత్తరం రాయలేదేం? ఏటి దగ్గరికి బండి పంపేవాడిని కదా! నడిచే వచ్చేశావు! రా! కాళ్ళు కడుక్కో! అమ్మా! అమ్మలూ! బాబుకి కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళియ్యి" - ఆశ్చర్యం ఆనందం మిళితమైన స్వరాలతో నాన్నగారి పలకరింపు.

మరు నిమిషంలో ఒక చేతిలో పెద్ద చెంబుతో కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళూ, మరో చేతిలో ఓ గ్లాసుతో తాగడానికి మంచినీళ్ళతో గుమ్మంలోకి వచ్చి "అంతా బాగున్నారా!" అంటూ అమ్మలు ఆహ్వానం.

కాళ్ళు కడుక్కుని, మంచినీళ్ళు తాగి, కొంచెం సేపు వాలు కుర్చీలో కూర్చుని ప్రయాణం బడలిక తీర్చుకున్నానో, లేదో, నే నొచ్చిన కబురు తెలిసి, తెలిసినవారంతా పలకరించటానికి వచ్చారు. వాళ్ళందరితో పిచ్చాపాటీ పూర్తి చేసేసరికి రాత్రి భోజనాల వేళయింది.

"ఇక వెళ్లిస్తాం బాబూ, తమరు భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి. చాలా అలిసిపోయి వచ్చారు" అని వాళ్లంతా వెళ్ళారు.

అమ్మలు కొసరి కొసరి వడ్డిస్తుంటే సుష్టుగా భోజనం చేసి తృప్తిగా త్రేనుస్తూ వరండాలో కొచ్చాను. అక్కడ మడత మంచం మీద చక్కగా, చాకింటి మడత, తెల్లది ఖద్దరు దుప్పటి పరిచిన పక్క తయారుగా ఉంది - చూడగానే నడుం వాల్చాలనిపించేలా.

'హమ్మయ్య' అని దానిమీద కూర్చోగానే, అదరా బాదరాగా, పరుగెత్తుకుంటూ వచ్చి నా కాళ్ళ దగ్గర చతికిల బడ్డాడు రాజప్ప. "చాలా సేపైందా బాబు వచ్చి? నాను ఏజన్సీకి పోయి, ఉప్పుడే వొచ్చి గెంజి దాగాక మీ రొచ్చినట్టు తెలిసింది. యెంటనే వొచ్చేసేను, తమరి దర్శనం చేసుకుందారని. నందూరు నుంచీ నడిచే వొచ్చేశారంట బాబూ. కొంచెం పాదాలు రాత్తాను. అలా పడుకోండి" అంటూ నా కాళ్ళు పట్టసాగాడు. పెద్ద పెద్ద పట్టణాల్లో బూర్జువా తత్వాల మీదా, ధనికవర్గాలు దళితవర్గాలకి చేసే అన్యాయాల మీదా దుమ్మెత్తి పోసే ఉపన్యాసాలు విని ఉరకవేసే నేను ఇక్కడ మాత్రం చప్పబడిపోయాను. వాడు నా కాళ్ళు పట్టి, ఒళ్ళు మాలీషు చేస్తాడని తెలుసు నాకు. ఇది అనాదిగా వస్తున్న ఆనవాయితీ వల్ల కావచ్చు. లేక నడిచి వచ్చి అలసిన శరీరం కోరే ఉపశాంతి కోసం కావచ్చు.

రాజప్ప ఒట్టి మాటలపోగు. వాణ్ణి కదిలిస్తే, డొంకంతా కదిలినట్టే! "ఏరా! అంతా బాగున్నారా? నీ కొడుకేం జేస్తున్నాడు?" అని అడిగాను నేను ఊరుకోక.

"ఏం బాగోడం బాబయ్యా! మాయలోకవై పోన్నాది. ఇదివరకులా గాదండి. నా కొడుక్కి ఉజ్జోగవిప్పిత్తానంటే మన పెసిడెంటుకి రెండు వేలు అప్పు జేసి ఇచ్చానండి. ఈసరి కారు నెలలయిందండి బాబూ! ఇటు ఉజ్జోగవూ లేదు. అటు డబ్బూ లేదు. అప్పుకి వడ్డీ మాత్రం పెరిగిపోనాదండి. ఏమయ్యా! అంటే 'ఇత్తానుండరా సంజికొడకా! వుజ్జోగవంటే మాటల్తో పనేటి?' అంటాడండి. ఇలాటోళ్ళ బరతం పట్టాలంటే మళ్ళీ బిటిసు పెబుత్వం రావాల"అని, అప్పుడే ఇంట్లో అడుగు పెట్టిన అగంతకుణ్ణి చూసి ఆగాడు.

ఆ వచ్చిన వాడు నాయుడు, "రేపు రేవు కెల్తన్నాను బాబయ్య బట్ట లెయ్యండి" అని అడిగాడు. వాడికి బట్టలేసి, వాడు వెళ్ళగానే "ఏరా! రాజప్పా! మధ్యలో ఆపేశావు?" అని అడిగాను మళ్ళీ సంభాషణ కొనసాగిద్దామనే ఉద్దేశంతో.

"ఈడు ఆరికి వత్తాసండి బాబూ! పెసిడెంటు గోరి నమ్మిన బంటండి. ఈ డెల్లి అరికాడేమైనా ఊదేత్తే మరి నన్నీ ఊళ్ళో బతకనియ్యరండి" అన్నాడు.

దానికి నేను నవ్వుతూ, "అది సరే కాని....ఒరే! వీడికి నాయుడు పేరెలా వచ్చిందిరా?" అని అడిగాను.

"ఛంపేశారు బాబూ!" అని పడుతున్న కాలిపిక్క మీద అందంగా ఓ దెబ్బ వేసి, "అయితే మీ కీడి ఇసయం తెల్దన్నమాట! మంచి పనే! చెప్పారుగాదేం?" అంటూ భుజం మీద తువ్వాలు తీసి కిందపెట్టి వళ్ళు పట్టే జోరు చూస్తుంటే ఏదో ముఖ్యమైన విషయమే చెప్పబోతున్నాడనిపించింది నాకు.

"నాకేం తెలియదురా! ఏంటది?" అని అడిగాను. అప్పుడే మా రైతు కన్నయ్య కూడా చుట్ట కాల్చుకుంటూ వచ్చి మా పక్కనే నేల మీద కూర్చున్నాడు. రాజప్ప చెప్పడం మొదలెట్టాడు.

"అదంతా ఓ పెద్ద కథలెండి బాబూ! చాలా ఏళ్ళ కిందట - అంటే మా తాత, ఉన్నప్పుడు నా కొడుకంత ఉన్నప్పటి సంగతి. అప్పటికింకా ఇంత సాతంత్రం వొచ్చెయ్యలేదు పెజలకి. బిటీసోడే రాజ్జెం చేసేవోడు. అప్పటి మాట, మావూరి బుగత పెద్దనాయుడు మంచి ఆజాను బాహుడు. పెద్దపులైనా 'ఆ...' అంటే ఆగవలసిందే! అంతటి పవరున్న మడిసి. ఆయన భార్య మొదటి కాన్పులోనే కూతుర్ని కని చచ్చిపోయింది. ఆయనకో యెదవక్కగారుంటే గంజి గాచి పోత్తదిగందా అని దాన్ని దెచ్చి దగ్గర పెట్టుకున్నాడండి. ఆయమ్మ మాచెడ్డ గడుసు మడిసట బాబూ! ఈ నాయుడు కూతురికి తన కొడుకుని కట్టబెట్టి మొత్తం ఆస్తంతా కాజేద్దారని సూసీదట" అని గుక్కతిప్పుకోడానికో క్షణం ఆగాడు.

"ఆహా! బుచ్చమ్మ కతంట్రా చెపుతున్నావ్?" అన్నాడు పక్కనే కూర్చున్న కన్నయ్య కాలుస్తున్న చుట్ట నోట్లోంచి తీసి, తుపుక్కున ఉమ్మేసి.

"నువుండేస్ బావయ్యా! ఆ సూట్టార్పేసెయ్. బాబుగోరికి సుట్టపొగసలే పడదు. నువ్వలా ఆలకించు. మద్దిలో మాటాడక. మరిసిపోతే గేపకం సెయ్యంతే!" అని రాజప్ప కన్నయ్యని కోప్పడ్డాడు. కన్నయ్య చుట్టార్పేసి నిశ్శబ్దంగా కూచుని వినసాగాడు.

"మనూళ్ళోనే ఈరాసామి పెళ్ళాం 'బుచ్చి' అని ఉండేదంట. పిటపిటలాడుతూ, మహా గొప్ప అందంగా ఉండేదని చెప్పుకుంటారు. అంతటి అందగత్తె మళ్ళీ మనూళ్ళో ఇంతవరకూ పుట్టలేదని చెప్పుతుంటారు దాన్ని చూసినోళ్ళు. ఎలాగయిందో బాబూ! అది మన నాయుడికి టాకా అయ్యింది."

రాజప్ప మాటలకి అడ్డుపడ్డాడు కన్నయ్య.

"ఎలా గవడమేటి? నాయుడు చీమూ నెత్తురూ ఉన్న మడిసి కాడేటి? పెళ్ళాం లేకుండా వొయిసులో ఉన్న మొగోడు ఎంతకాలం వుంటాడు? ఎర్రగా బుర్రగా ఉందని నెమ్మదిగా దాని ఇలాకా పడ్డాడు."

"నువ్వుండెహె! ఆ మాత్రం బాబుగోరికి తెల్దనకున్నావేటి?" అని అతణ్ణి వారించి మళ్ళీ మొదలెట్టాడు రాజప్ప.

"అదికాదు బాబూ! పెళ్ళిచేసుకోవాలంటే పెద్ద నాయుడు 'కో' అంటే కోటిమంది కన్నె పిల్లలొచ్చీవోరు. అసలు కీలకం ఆ యెదవక్క గారిలో ఉందని చెప్పుకుంటారు. నాయుడు మళ్ళా పెళ్ళి చేసుకుంటే, పిల్లలుడితే ఆస్తంతా తన కొడుక్కి కాకుండా పోతుందని ఏ సమ్మంధవూ పడనిచ్చేదికాదట. ఆయమ్మకి జడిసి మరెవరూ పిల్లనిస్తామని ముందుకు రాలేదట. అదేం చిత్రమో ఇంత పెద్ద నాయుడూ అక్కగారి దగ్గర మాత్రం పిల్లి అయిపోయీ వోడట. ఎలాగయితేనేం, పెద్ద నాయుడు - బుచ్చి యావ్వారం ఊరు వాడా పాక్కి నలుగురికీ తెలిసేసరికి దానికో కొడుకు కూడా పుట్టేడు. ఈ అవమానం భరించలేకా నాయుడు మీద తన కసి తీర్చుకోలేకా ఈరాసామి బుచ్చిని ఏలుకోడం మానేశాడు.

"బుచ్చి రోజూ నీలాటి రేవుకి ఎల్లేప్పుడూ, వచ్చేప్పుడూ కొడుకుని సంకనేసుకొచ్చి నాయుడి ఇంటి ముందు దిగబెట్టి, 'ఈడు నీ కొడుకే ఏం జేసుకుంటావో' అని వొదిలేసి పోయేది.

"దాన్నింట్లో జేరదీస్తే పెద్ద నాయుడు చాకలిదాని చేతి గంజి దాగేడన్న అవమానంతో నేనురోనుకు చస్తా'నని నాయుణ్ణి బెదిరించేది అక్కగారు.

"ఎటూ చెప్పలేక ఇరకాటంలో పడేవోడు పెద్ద నాయుడు.

"ఇదిలా ఉండగా నాయుడంటే పడని ఓ పెద్దమడిసి - ఆరి పేరేటన్నావు కన్నయ్యా?" అని పేరు మరిచిపోయి కన్నయ్యడిగాడు.

"పే రేదైతే నేంలే, ఆడు మా తాతే గదా" అన్నాడు కన్నయ్య.

"అవును మరిచేపోయేను. ఆయన ఈ కన్నయ్యకి తండ్రి తండ్రే. ఆయన, ఈరాసామిని చేరదీసి ఓరి గాడిదకొడకా! నీ పెళ్ళాన్నలా ఒదిలేసేవేరా? పెద్ద నాయుడిని బెదిరించి ఓ అరెకరం రాయించుకోడానికి నీ కిదే అదును. దాని కంటం ముడి దగ్గర మంగలి కత్తితో చిన్నగా గాటెట్టించి, నాయుడింటికెల్లి 'నాయుడు నన్ను చంపేశాడు బాబోయ్!' అని అరిచి గోలచెయ్యమను. దెబ్బతో నాయుడు దిమ్మ దిరిగి ఇదెంతకేనా తెగించిందని భయపడి మాటాడకండా అరెకరం ముక్క రాసేత్తాడు. నువ్వెంతకాలం కుళ్ళు బట్టలు గుంజితే అరెకరం

బూ(వి సంపాదించగలవు? నువ్వు ఊ( అను. తరవాత పని నేన్జూసుకుంటాను' అని బోధించి చెప్పేడు. ఈరాసామి మొదట్లో బయపడినా, బూ(వి రాయించుకునే ఆశ బాగా తలకెక్కి ఒప్పేసుకున్నాడు" అని, ఆగాడు రాజప్ప.

"ఈపనికి, ఆళ్ళు ఎంచుకున్నోడు ఈడి తాతే బాబూ!" అన్నాడు కన్నయ్య.

"సర్లేవోయ్! ఇన్ని చెప్పినోణ్ణి, అది చెప్పనాకి బయపడతాననుకున్నావేటి?" అని రాజప్ప మళ్ళీ తన కథనం సాగించేడు.

"అనుకున్న పెకారం ఓ రోజుని మునిమాపుటేళ నాయుడింటి పక్క జంతి (సందు)లో కలుసుకున్నారు బుచ్చి, ఈరాసామీ. ఈయన తాతా, మా తాతానూ. మా తాత మంగలి కత్తితో గాటు పెట్టడానికీ, ఆళ్ళిద్దరూ ఆ సమయంలో ఎవరూ రాకుండా చూడడానికి వచ్చున్నం. సరిగ్గా మా తాత కత్తి బుచ్చి కంటం ముడి మీద పెట్టే టయిముకి 'అమ్మో! ఎవరో ఒత్తన్నార్రా!' అని అరిచేడు ఈరాసామి. ఆ కంగారులో అనుకున్న దానికంటే లోతుగానే గంటు పెట్టాడు మా తాత. తరవాత ముగ్గురూ గాలైపోయారు.

"నన్ను చంపేశారు బాబోయ్" అని అరుస్తూ చాకలి బుచ్చి పరుగెత్తుకెళ్ళి నాయుడింటి అరుగు మీద కూలబడిపోయింది. నాయుడు కంగారుగా బైటికి వచ్చి "ఏమయిందే!" అని అడుగుతూ రెండు జబ్బలూ పట్టుకుని లేవనెత్తబోతే, బుచ్చి బుర్ర వెనక్కి వేలాడేసింది. దాంతో ఆ ఉన్న పట్టు కాస్తా తప్పిపోయి కంటంలోంచి పేనం గాలిలో కలిసిపోయింది. నాయుడికి జవాబు చెప్పనాకి ఇక బుచ్చి లేదు. 'ఎదవసన్నాసులెవరో దీన్ని పొట్టనెట్టుకున్నారు' అని భుజాన్నున్న తుండుగుడ్డ దాని కంటం చుట్టూ చుట్టబెట్టాడు నాయుడు నెత్తురు కారకుండా!

"ఆ తరవాత అది పోలీసు కేసయింది. పోలీసులొచ్చేరు మనూరికి. పోలీసులంటే, ఇప్పటి పోలీసులేటి బాబూ! ఈళ్ళు కానీకి కక్కుర్తి పడే రకం. అప్పటోళ్ళు బిటిసు పోలీసులు. లాఠీ తిరగేసి ఒక్కో దెబ్బస్తే పరలోకాలు కనిపించేవంట. ఆళ్ళదాటికి తట్టుకోలేక ఊరు ఊరంతా పారిపోయి తుప్పల్లో దాక్కున్నారని చెప్పుకునేవారు. అందుకే నేను మళ్ళీ బిటిసు పెబుత్వం రావాలన్నాను. ఆ కేసు నుంచి బైటపడేసరికి నాయుడు అరెకరం బూ(వి అమ్మేశాడని విన్నాను."

కథనంతా జాగ్రత్తగా వింటున్న నాకు చిన్న సందేహం వచ్చి అడిగాను. - "సరేగాని, అదెలా ఒప్పుకుందిరా అంత ప్రమాదమైన పనికి" - అని.

"పెమాదమేముంది బాబూ! చిన్న గంటెడతాడంతే గందా. తరవాత సాయిబు డాట్రుకాడ మందుచ్చుకుంటే తగ్గిపోద్దనుకు నుంటాది. అయినా ఆ రోజుల్లో అరెకరం బూ(వంటే ఆశపడని మడి సెవడండీ? అప్పుడు పరారైపోయిన మా తాత మళ్ళా గునుపూడి పొలిమేరల్లో కాలెట్టలేదంటారు. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే ఆ బుచ్చి కొడుకే ఈ నాయుడు. ఆ యింటా, ఈ యింటా పెరిగి ఇంతయ్యాడు. ఇదీ ఆడు నాయుడైన వైనం బాబూ!"

ఆలోచిస్తూ నేను నెమ్మదిగా నిద్రాదేవి ఒడిలోకి జారిపోయాను. రాజప్ప నా ఒళ్ళు పట్టడం పూర్తిచేసి ఎప్పుడు వెళ్ళిపోయాడో నాకు తెలియదు. ✷